క్లుప్తంగా

పూడికతీత పనులు ప్రారంభం



గోపినేనిపాలెం(వత్సవాయి): పెనుగంచిప్రోలు మేజర్ కాలువలో పూడిక తీత పనులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సోమవారం ప్రారంభించారు. కాలువలో తూటికాడ, పూడికమట్టి ఉండడంతో దిగువకు నీరు సక్రమంగా సరఫరా కావడంలేదని రైతులు ఎమ్మెల్యేకు చెప్పడంతో స్పందించిన ఆయన ఎన్ఎస్పీ అధికారులతో మాట్లాడి పూడికతీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు సాగునీరు వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుని దిగువభూములకు నీరందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో వేగినేటి గోపాలకృష్ణమూర్తి, కర్ల నాగేశ్వరరావు, కామినేని కిషోర్, అలసకాని నవీన్, మన్నె నారాయణ, బొల్లం పురుషోత్తం, జిల్లేపల్లి సుధీర్‌బాబు, సత్తి బేతోలు, పతకమూడి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



పెనుగంచిప్రోలు: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు షేక్ నవాబ్‌జానీ డిమాండ్ చేశారు. మండలంలోని పెనుగంచిప్రోలు, ముండ్లపాడు, శనగపాడు, సుబ్బాయిగూడెం, కొణకంచి. నవాబుపేట, కె.పొన్నవరం గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ వెంటనే అమలు చేయాలని కోరారు. అపార్, మార్కుల నమోదు విషయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి లేకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ పత్రికా సంపాదకులు గద్దం నారాయణరావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆవుల రాంబాబు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చాట్ల నిరంజన్, భూపతిరావు, ఉపాధ్యక్షులు కరీముల్లా , నాయకులు మల్లెంపాటి రాధాకృష్ణమూర్తి, జాఫర్, శివకుమార్, బ్రహ్మయ్య, రఫీ, నజీర్, సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి వెండి వస్తువుల వితరణ



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసి ఉన్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామికి ఓ భక్తుడు వెండి వస్తువులను సోమవారం వితరణగా అందజేశారు. వత్సవాయి గ్రామానికి చెందిన దుడ్డి శ్రీనివాసరావు అనే దంపతులు 2 కేజీల 200 గ్రాముల వెండి ఊయల రేకులను ఆలయ ఈవో కేటీఎస్ వరప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారికి స్వామివారి ప్రసాదాలు, చిత్రపటాలు అందజేశారు.

వైభవంగా సంగీత మహోత్సవాలు



విజయవాడకల్చరల్: శ్రీసద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శృంగేరీ పీఠ పాలిత శివరామ కృష్ణ క్షేత్రంలోని విద్యాభారతి శ్రవణసదనంలో నిర్వహిస్తున్న 31వ వార్షిక సంగీతోత్సవాలు సోమవారం రెండో రోజుకు చేరుకున్నాయి. విఖ్యాత సంగీత విద్వాంసులు మల్లాది సోదరులుగా ప్రసిద్ధి చెందిన మల్లాది శ్రీరామ ప్రసాద్, మల్లాది రవికుమార్‌లు నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీ సంగీత వైభవాన్ని చాటింది. స్వీయ రచనలతో పాటు సంగీత త్రిమూర్తులు సద్గురు త్యాగరాజ స్వామి, ముత్తు స్వామి దీక్షితార్, శ్యామశాస్త్రిలు రచించిన సంకీర్తనలను గానం చేశారు. లాల్‌గుడి జయరామన్ వర్ణం, త్యాగరాజ స్వామి కీర్తన పలకవేమి నాదైవమా చనితోడి తేవే తదితర కీర్తనలు ఆలపించారు. మల్లాది సూరిబాబు సంగీత వారసులు సింధురాగేశ్వరి, అరవింద్, శివానంద యశస్వి వాద్య సహకారం అందించారు. శ్రీ సద్గురు సంగీత సభ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి పోపూరి గౌరీనాథ్, గాయత్రి గౌరీనాథ్, సంస్థ కోశాధికారి జేఎస్ఎస్ ప్రసాద్ శర్మ నిర్వహించారు. సంగీత విద్వాంసులకు నిర్వాహకులు జ్ఞాపికలను అందజేశారు.

నేటి కార్యక్రమం

డాక్టర్ ముప్పవరపు సింహాచల శాస్త్రికి హరికథా చతురాన బిరుదు ప్రదానంతో పాటు డాక్టర్ కే వాగీష్ గాత్రం కార్యక్రమాలు జరుగుతాయి.

సాగునీటి సంఘాల ఎన్నికల వేడి!

- డిసెంబర్ 5న ఎన్నికల షెడ్యూల్
- రైతుల మధ్య మొదలైన కోలాహలం
- జగ్గయ్యపేట నియోజకవర్గంలో 18 నీటి సంఘాలకు ఎన్నికలు
- ఏర్పాట్లలో అధికారులు నిమగ్నం



గండ్రాయి-డివిఆర్ బ్రాంచ్ కాలువ

జగ్గయ్యపేట: గ్రామాల్లో సాగునీటి సంఘాల ఎన్నికల వేడి మొదలైంది. ఈ నెల 23న జరగాల్సిన ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసింది. దీంతో డిసెంబర్ 5న ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో సంబంధిత అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. 8న సాగునీటి సంఘాలకు, 11న డిస్ట్రిబ్యూటర్ కమిటీలకు ఎన్నికలు, 14న ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు. ఇందు కోసం డివిఆర్ బ్రాంచ్ కెనాల్, దాములూరు మేజర్ కాలువల పరిధిలోని సర్వే నెంబర్ల ప్రకారం రైతుల జాబితాను రెవెన్యూ అధికారులు సిద్ధం చేశారు.

నియోజకవర్గంలో 18 నీటి సంఘాలు....

జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల పరిధిలోని గండ్రాయి (డబ్ల్యూయుఏ-1), చిల్లకల్లు (డబ్ల్యూయుఏ-5), బూదవాడ (డబ్ల్యూయుఏ-12), పోచంపల్లి(డబ్ల్యూయుఏ-11), చిన్న మోదుగపల్లి (డబ్ల్యూయుఏ-2), మంగొల్లు (డబ్ల్యూయుఏ-4), భీమవరం(డబ్ల్యూయుఏ-6), డబ్బాకుపల్లి (డబ్ల్యూయుఏ-26), వేములనర్వ(డబ్ల్యూయుఏ-27), వత్సవాయి(డబ్ల్యూయుఏ-28), కంభంపాడు(డబ్ల్యూయుఏ-29), పెనుగంచిప్రోలు-1(డబ్ల్యూయుఏ-3), పెనుగంచిప్రోలు-2(డబ్ల్యూయుఏ-7), ముండ్లపాడు-1(డబ్ల్యూయుఏ-8), ముండ్లపాడు-2(డబ్ల్యూయుఏ-9), తోటచర్ల(డబ్ల్యూయుఏ-10), నవాబుపేట(డబ్ల్యూయుఏ-23), అనిగండ్లపాడు(డబ్ల్యూయుఏ-30) సాగునీటి సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘానికి 12 మంది టీసీ సభ్యులు ఉంటారు. సాగునీటి ప్రాజెక్ట్‌ల పరిధిలోని నీటి సంఘాలు డిస్ట్రిబ్యూటరీలకు ఎన్నికలు నిర్వహిస్తారు. మూడు దశల్లో ఎన్నికల ప్రక్రియ చేపడతారు. ఒక్కో సాగునీటి సంఘంలో 12 మంది సభ్యులను ఎన్నుకుంటారు. వీరిని టీసీ మెంబర్లుగా పిలుస్తారు. టీసీ మెంబర్లంతా కలిపి డబ్ల్యూ ప్రెసిడెంట్, వైస్‌ప్రెసిడెంట్‌లను ఎన్నుకుంటారు. తొలి విడతగా సాగు సంఘాలకు, రెండవ విడతలో డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు పూర్తిచేస్తారు. ఇక మూడవ దశలో ప్రాజెక్ట్ కమిటీకి సంబంధించిన డిస్ట్రిబ్యూటరీ కమిటీలోని చైర్మన్, వైస్‌చైర్మన్‌ను, డైరెక్టర్‌లను ఎంపిక చేస్తారు. ఇందుకోసం ప్రత్యేక నోటిఫికేషన్ వెల్లడించేందుకు తేదీలను కూడా ప్రకటిస్తారు.

40 వేల మందికి పైగా ఓటర్లు.....

సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి రెవెన్యూ అధికారులు ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. ఆయా సంఘాల వారీగా ఓటర్ల జాబితాను నీటి పారుదలశాఖ అధికారులకు అందించారు. నియోజకవర్గంలోని జగ్గయ్యపేట-4, వత్సవాయి-7, పెనుగంచిప్రోలు-7 చొప్పున 18 నీటి సంఘాలున్నాయి. ఇందులో జగ్గయ్యపేట డబ్ల్యూయుఏ-1,5,11,12 పరిధిలో 14,881మంది, వత్సవాయి డబ్ల్యూయుఏ-2,4,6,26,27,28,29 పరిధిలో 14,402 మంది, పెనుగంచిప్రోలు డబ్ల్యూయుఏ-3,7,8,9,10,23,30 పరిధిలో 10,977 మంది చొప్పున పురుషులు, మహిళ రైతులు ఉన్నారు. ఈ ఎన్నికలు బ్యాలెట్ విధానంలో కాకుండా చేతులెత్తి ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యులను, అధ్యక్షులను ఎన్నుకోవాల్సి ఉంటుంది.

ఎన్నికలపై సందేహాలు...

సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగుతాయో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకుండా ప్రత్యేక ప్రణాళికలు తయారుచేస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే గ్రామాల్లో వారికి అనుకూలంగా ఉన్నవారి పేర్ల జాబితాను తయారు చేసి ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు పావులు కదుపుతున్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే ఓటర్ జాబితాను సిద్ధం చేశాం. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం తదుపరి చర్యలు ప్రారంభిస్తాం.

– సంతోష్ రాథోడ్, ఈఈ, జగ్గయ్యపేట డివిజన్, ఎన్ఎస్‌పీ ఓఎస్ఎం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ జె.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ముక్త్యాల బస్టాండ్ రోడ్డు, పెద్ద రామాలయం, ఆకులవారి వీధి, అద్దాలబజారు, రంగస్వామి బజారు, కాగితాల బజారు, శివాలయం వీధి, నాగమయ్య బజారు, రజక బజారు, నాయీ బ్రాహ్మణ బజారు, బ్రాహ్మణబజారు, యానాది కాలనీ, మఠం శివాలయం ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలి

వీరులపాడు: ప్రజలకు వీఆర్వోలు నిత్యం అందుబాటులో ఉండాలని తహసీల్దార్ హుస్సేన్ తెలిపారు. మండల కేంద్రం జుజ్జూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమించకుండా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. అంతేకాకుండా రెవెన్యూ రికార్డుల విషయంలో జాగ్రత్తలు వహించాలని లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ నాగరాజు, ఆయా గ్రామాల వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయాలు కిటకిట



ముక్త్యాల కోటిలింగాలలో అమృతలింగేశ్వరునికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



తిరుమలగిరి శివాలయంలో ప్రత్యేకాలంకరణలో స్వామి వారు



పట్టణంలోని బ్రాహ్మణబజారులోని శివాలయంలో పంచదారతో అభిషేకం

జగ్గయ్యపేట: కార్తిక మాసం నాల్గో సోమవారం కావటంతో మండలంలోని పలు గ్రామాల్లోని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని ముక్త్యాల గ్రామంలోని భవానీ ముక్తేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సమీపంలోని కోటిలింగ హరిహర మహాక్షేత్రంలోని పంచముఖ అమృతలింగేశ్వరునికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఏకరుద్రాభిషేకం, తులసీ దళాలతో పూజలు చేశారు. తిరుమలగిరి గ్రామంలోని కొండపైనున్న శివాలయంలో స్వామి వారిని బిళ్వపత్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజామునే మహిళలు కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేశారు. కోటిలింగాలలో భక్తులు బాణవాయు శివలింగాలను ప్రతిష్ఠించారు. అనుమంచిపల్లి శివాలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అదేవిధంగా పట్టణంలోని బ్రాహ్మణబజారులో వేంచేసి ఉన్న అన్నపూర్ణసమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు నరసింహారావు ఆధ్వర్యంలో అన్నాభిషేకం, పంచాదారతో అభిషేకాలు నిర్వహించారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

నందిగామ టౌన్: కార్తీక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండలంలోని దాములూరు కూడలి గ్రామంలో సంగమేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. వేకువ జామునే వైరా ఏటిలో పుణ్య స్నానాలాచరించి కార్తీక దీపాలు వెలిగించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించటంతో పాటు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిళ్వార్చన పూజలు నిర్వహించారు. గోళ్లమూడి శంభులింగేశ్వర స్వామి, దాములూరు, రాఘవాపురం రామలింగేశ్వర స్వామి వారి ఆలయాలలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అదే విధంగా పట్టణంలోని రామలింగేశ్వర స్వామి, చెన్నకేశవస్వామి వారి ఆలయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేయటంతో పాటు కార్తీక దీపాలు వెలిగించారు. ఆయా ఆలయాల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

భక్తులతో కళకళలాడిన ఆలయాలు

పెనుగంచిప్రోలు: పవిత్ర కార్తిక మాసం చివరి సోమవారం సందర్భంగా గ్రామంలో వేంచేసి ఉన్న స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయం, తిరుపతమ్మవారి ఆలయంతో పాటు మండలంలోని పలు ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. ఆలయ అర్చకులు స్వామివారు, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు, పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు ఒత్తులు వెలిగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో దీపాలంకరణ



కంచికచర్ల పాత శివాలయంలో భక్తులచే పూజలందుకుంటున్న స్వామి

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కంచికచర్ల: కార్తీక మాసం నాల్గో సోమవారం సందర్భంగా పాత శివాలయంలో స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి మహిళలు తెల్లవారుజామునే చేరుకుని దీపారాధన చేశారు. అదేవిధంగా ఆలయ అర్చకులు స్వామి వారికి నీరాజన మంత్ర పుష్పములు, మహన్యాసపూర్వక అభిషేకాలు, అష్టోత్తర పూజలు చేశారు. మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం , వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పరిటాల, గండేపల్లి, చెవిటికల్లు, మోగులూరు, గనిఆత్కూరు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు స్వామికి విశేష పూజలు చేశారు.





శంభులింగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు, స్వామికి దీపాలంకరణ

పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలని వినతి



మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావుకు వినతి పత్రం అందజేస్తున్న కౌన్సిలర్ వట్టెం మనోహర్

జగ్గయ్యపేట అర్బన్: పురపాలక సంఘం పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల జీతాలు సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావుకు సోమవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో పనిచేస్తున్న 140 మంది మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు గత రెండు నెలలుగా జీతాలు అందజేయడం లేదని తెలిపారు. అదేవిధంగా పట్టణంలో వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉందన్నారు. అలాగే మంచినీటి సరఫరా, వీధిలైట్లు, సచివాలయం వ్యవస్థ పనితీరుపై కౌన్సిల్ సమావేశంలో నిర్ణయాలు తీసుకొని వాటిపై చర్యలు చేపట్టాలని కోరారు. మున్సిపల్ కార్మికుల జీతాలను డిసెంబర్ 1 వ తేదీన చెల్లించాలని తెలిపారు. లేనిపక్షంలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

వ్యాపార కేంద్రాలుగా బస్టాప్‌లు

కంచికచర్ల : 65వ నెంబర్ జాతీయ రహదారిపై ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మాణాలు చేపట్టిన ఆర్టీసీ బస్‌స్టాప్‌లు వ్యాపార కేంద్రాలు మారాయి. కొన్ని బస్‌స్టాప్‌లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా తయారయ్యాయి. కొన్ని బస్‌స్టాఫ్‌లలో తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతుంది. అధికారులు కనీసంగా కూడా స్పందించడం లేదు. ప్రయాణికులు సైతం మనకెందుకులే అంటూ బస్సుల కోసం ఎండలోనే నిలబడుతున్నారు. వర్షంలో తడుస్తూ బసుల కోసం నిరీక్షిస్తున్నారు. వారి వెంట వచ్చే చిన్నపిల్లలను సైతం ఎండలోనే నిలబెట్టుకుని బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. అంతేకాకుండా రాజకీయ పార్టీల నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకునేందుకు కూడా బస్‌స్టాఫ్‌లు ఉపయోగపడుతున్నారు. నేషనల్ హైవే పక్కన టోల్‌ప్లాజా నిర్వాహకులు, గత ప్రభుత్వంలో ఎంపీ నిధులతో ప్రయాణికుల సౌకర్యార్థం బసుస్టాప్‌లు నిర్మించారు. కానీ ఆవి ప్రయాణికులకు ఉపయోగంలో లేకుండా పోయాయి. మద్యం ప్రియులకు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వ్యక్తులకు, భిక్షాటన చేసే వారికి ఉపయోగపడుతున్నాయి. కొంతమంది మద్యం ప్రియులు బస్‌స్టాప్‌లలో మద్యం తాగి సీసాలను అక్కడే పగులకొడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్‌స్టాఫ్‌లో వ్యాపారం చేసేవారిని, ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలని, అదే విధంగా బస్‌స్టాఫ్‌లలో అసాంఘిక కార్యకలాపాలు చేసేవారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

పురాతన బావి పూడికతీత పనులు



బావి పునురుద్ధరణ పనులను పరిశీలిస్తున్న వేదపండితులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ప్రాచీనమైన శ్రీరంగనాయకస్వామి ఆలయంలో ఉన్న అతి పురాతనమైన దిగుడు బావి పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్తికమాసం సోమవారం ఆలయ ఆవరణలోని రామాలయం ధ్వజస్తంభం సమీపంలోని అతి పురాతనమైన దిగుడుబావి పూడికతీత కార్యక్రమాన్ని ఆర్య వైశ్య ప్రముఖులు శ్రీరాం రామకృష్ణ, గాయత్రీ ఆశ్రమం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ చిట్టా లక్ష్మీనరసింహశాస్త్రి, వేదపండితులు పిల్లలమర్రి నాగకృష్ణశర్మ, శ్రీరాం కిషోర్, శ్రీరాం జయరాం, దేవిశెట్టి అనిల్ పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీరాం రామకృష్ణ విలేకర్లతో మాట్లాడుతూ కొన్ని ఏళ్లుగా దిగుడు మెట్ల బావి వాడుకలో లేదని, దానిని తిరిగి వాడుకలోకి తీసుకువచ్చేందుకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సూచనలతో, ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు, ఆలయ స్థానాచార్యులు ముడుంబా రంగాచార్యులు, యువనాయకుడు శ్రీరాం ధనుంజయతో మాట్లాడి బావి పూడికతీత పనులు చేపట్టామని చెప్పారు. పనులు దాదాపు పూర్తయ్యాయని, బావిలో నీటి ఊట చేరిన గంగమ్మ తల్లి జలాలకు ఈ సందర్భంగా చిట్టా లక్ష్మీనరసింహశాస్త్రి, పిల్లలమర్రి నాగకృష్ణశర్మలు కొబ్బరికాయలు కొట్టి విశేషపూజలు నిర్వహించారు.

బహుజన ధర్నాను జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న బీఎస్పీ, బీసీ సమన్వయ కమిటీల రాష్ట్ర నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో డిసెంబర్ 1 వ తేదీన విశాఖపట్నంలో జరిగే బహుజన ధర్నాను విజయవంతం చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజు, రాష్ట్ర కార్యదర్శి కొదమల ప్రభుదాసు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక బీఎస్పీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ ముఖ్య కార్యవర్గ సమావేశంలో బహుజన ధర్నాకు సంబంధించిన కరపత్రాలను పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజు, రాష్ట్ర కార్యదర్శి కొదమల ప్రభుదాసు, బీసీ సమన్వయ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అంగడాల పూర్ణచంద్రరావు తదితరులు విడుదల చేశారు. బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుష్పరాజు మాట్లాడుతూ డిసెంబర్ ఒకటో తేదీన విశాఖపట్నంలో జరిగే బహుజన ధర్నాలో రాజ్యసభ సభ్యులు రాంజీ గౌతమ్ పాల్గొంటారని చెప్పారు. ఈ ధర్నాకు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పచ్చిపాల నాగేశ్వరరావు, ఓబీసీ మహాజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి కుంభం వెంకట్, శాలివాహన సంఘ రాష్ట్ర నాయకులు పోలంపల్లి రాధమ్మ, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా గోపి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) జాతీయ కార్యవర్గ సభ్యుడిగా విజయవాడ నగరానికి చెందిన యాగంటి వెంకట గోపి ఎన్నికయ్యారు. గోరఖ్‌పూర్‌లో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగిన ఏబీవీపీ 70వ జాతీయ మహాసభల్లో ఈ ఎన్నిక జరిగిందని వెంకట గోపి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏబీవీపీ నగర కార్యదర్శిగా, ఏబీవీపీ ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్‌గా విద్యార్థుల సమస్యలపై ఎన్నో ఉద్యమాలు నిర్వహించానన్నారు.

నేడు రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహణ

జగ్గయ్యపేట అర్బన్: భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం పట్టణంలో మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రతినిధులు సోమవారం తెలిపారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అధ్యక్షతన ఉదయం 10 గంటలకు స్థానిక సత్యనారాయణపురంలో ఆనందసాయి ఆలయం ఎదురుగా ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొనాలని కోరారు.

ఆచంట సేవలు ఆదర్శనీయం



వెంకటరత్నం నాయుడు వర్ధంతిలో హరగోపాల్, గోళ్ళ నారాయణరావు, రావి

విజయవాడ కల్చరల్: రంగస్థల నటుడు ఆచంట వెంకటరత్నం నాయుడు సేవలను ఆదర్శంగా తీసుకోవాలని జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు తెలిపారు. నాటక రంగస్థల ప్రముఖుల సమక్షంలో రంగస్థల నటుడు ఆచంట వెంకటరత్నం నాయుడు 9 వ వర్ధంతి సభను తుమ్మలపల్లి వారి క్షేత్రంలో ఆచంట విగ్రహం వద్ద సోమవారం నిర్వహించారు. గోళ్ళ నారాయణరావు మాట్లాడుతూ పద్యనాటకంలో ఆయన చేసిన ప్రయోగాలు మరెవరూ చేయలేదన్నారు. రావి వెంకట్ మాట్లాడుతూ ఆయనలోని ప్రతిభను గుర్తించి ప్రభుత్వం ఆయనకు పలు అవార్డులు ప్రదానం చేసినట్లు తెలిపారు.

ఆకట్టుకున్న హరికథ గానం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన గుడిపాటి జయరామ సుధాకర్ భక్త మార్కండేయడనే అంశంపై హరికథా గానం చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై గుడిపాటి జయరామ సుధాకర్ మార్కండేయుడి గురించి హరికథ రూపంలో చక్కటి వ్యాఖ్యానంతో వివరించారు. సుధాకర్‌కు మృదంగంపై చావలి కృష్ణమోహన్, వయోలిన్‌పై శ్రీనివాస్ చక్కటి సహకారం అందించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జరిగిన హరికథను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం సుధాకర్ బృందానికి అమ్మవారి దర్శనం కల్పించి డీఈవో రత్నరాజు ప్రసాదాలు అందజేశారు.